ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 11 మార్చి 2024 | 5

సాహిత్యం అనంతమైనది
• సినీ గేయ రచయిత భువనచంద్ర
• కాకినాడలో ముగిసిన అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు ...7లో



ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి

ఆత్రేయపురం, మార్చి 10: కోనసీమ తిరుమల వాడపల్లి ఆదివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఖండవిల్లి సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో 21 రోజులు దీక్ష చేపట్టిన గోవింద మాలధారులు శ్రీవేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మంటపారాధన, అభిషేకం, ఇరుముడిధారణ స్వామి వారికి జరిపారు. ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో దీక్షాదారులు మహా సుదర్శన హోమం, మహా పూర్ణాహుతి, వేద ఆశీర్వచనం జరిగాయి.



అభిషేకాన్ని తిలకిస్తున్న గోవిందమాల దీక్షధారులు

నేటి నుంచి పెద్దింట్లమ్మ అమ్మవారి ఉత్సవాలు



అంతర్వేది, మార్చి 10: సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం గ్రామ పరిధి మెండుపాలెం చిన్న కొల్లేరులో వెలసియున్న శ్రీపెద్దింట్లమ్మ అమ్మవారి ఉత్సవాలు సోమవారం నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా 19వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు అమ్మవారి ప్రభ ఊరేగింపు రాత్రి 10.36 గంటలకు శ్రీగోకర్ణేశ్వరస్వామి, జలదుర్గ అమ్మవారి కల్యాణ మహోత్సవం జరగనుంది. నెల రోజుల పాటు జరిగే ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తారని, భక్తులకు అవసరమైన తాగునీరు, వసతి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

- నాటి ప్రత్యర్థులు.. నేటి రాజకీయ మిత్రులు
- టీడీపీ నుంచి వెళ్లిన మాజీ మంత్రి గొల్లపల్లికి రాజోలు అసెంబ్లీ స్థానం
- జనసేన నుంచి వెళ్లిన రాపాకకు లోకసభ టిక్కెట్
- వారిద్దరి రాజకీయ వ్యవహార శైలిపై నెటిజన్ల కామెంట్స్
- నాటి ప్రత్యర్థులుగా దుమ్మెత్తి పోసుకున్న వీడియోలు వైరల్
- సీఎం జగన్ అపాయింట్‌మెంట్ కోరిన ఎంపీ అనురాధ
- నేడో, రేపో భేటీ.. ఆపై రాజకీయ భవిష్యత్తు నిర్ణయం

వైసీపీ ఎమ్మెల్యేల్లో అసంతృప్తి



అమలాపురం వైసీపీ లోక్‌సభ సమన్వయకర్తగా నియమితులైన రాపాక వరప్రసాదరావును కలిసిన రాజోలు అసెంబ్లీ వైసీపీ సమన్వయకర్త గొల్లపల్లి సూర్యారావు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమిస్తూ వైసీపీ చేసిన ప్రకటన తాజాగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఒకనాటి చిరకాల ప్రత్యర్థులిద్దరూ ఒకరు అసెంబ్లీకి, మరొకరు లోక్‌సభ స్థానానికి పోటీ చేయనున్న పరిస్థితులపై సోషల్ మీడియాలో నెటిజన్లు దుమ్మెత్తి పోస్తున్నారు. సుదీర్ఘ కాలం పాటు ఆ ఇరువురు ప్రత్యర్థులు అవినీతి, అక్రమాలపై దుమ్మెత్తి పోసుకున్న వీడియోలను ఇప్పుడు వైరల్ చేస్తూ వారిపై తీవ్ర స్థాయిలో తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నుంచి వైసీపీలోకి చేరిన కొన్ని రోజులకే రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావును, రాజోలు తరఫున జనసేన ఎమ్మెల్యేగా ఎన్నికై వైసీపీ పక్షాన చేరిన రాపాక వరప్రసాదరావును అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్తగా రెండు రోజుల క్రితం ప్రకటించారు. టీడీపీ నుంచి గొల్లపల్లి, వైసీపీ నుంచి రాపాక మధ్య గతంలో జరిగిన సంవాదాలు, వివాదాలు, మీడియా సమావేశాల్లో చేసుకున్న ఆరోపణలను తాజాగా వెలుగులోకి తెస్తూ వీడియోలు పోస్టు చేస్తున్నారు. ఇవి చూసిన వారు రాజకీయాలు ఏ స్థాయికి దిగజారాయోనని వ్యాఖ్యానాలు చేస్తున్నారు.

నిన్నటి వరకు ప్రత్యర్థులుగా ఉన్న గొల్లపల్లి, రాపాక ఇప్పుడు రాజోలు నియోజకవర్గంలో వైసీపీ గెలుపు కోసం ఐక్యతా రాగం ఆలపిస్తున్నారు. అమలాపురం లోక్‌సభ సమన్వయకర్తగా ప్రకటితమైన రాపాక వరప్రసాదరావు, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త గొల్లపల్లి సూర్యారావు ఇద్దరూ రాపాక స్వగృహంలో కలిసి ముచ్చటించుకున్నారు. ఒకరికొకరు ఎనలేని అభిమానంతో ఆలింగనం చేసుకున్నారు. వైసీపీ అభ్యున్నతికి పరస్పరం కలిసి పనిచేయడానికి నిర్ణయించుకున్నారు. వారిద్దరిలో వచ్చిన మార్పులపై నెటిజన్లు చేస్తున్న కామెంట్లు అన్నీ ఇన్నీ కావు. ఒకరి గెలుపు కోసం ఒకరు కలిసి పనిచేసేందుకు నేతలిద్దరూ ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఆ పరిణామాలను రాజోలు నియోజకవర్గంలో వైసీపీలో ఉన్న కొందరికి మింగుడు పడడం లేదు. నేతలో కృతజ్ఞతాకార్యకర్తల మనసులు కలవడం కష్టమేనని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. వారిద్దరి కలయిక రాజోలు నియోజకవర్గంలో వైసీపీని ముంచుతుందా తేల్చుతుందా అనేది కాలమే చెప్తుందని జనసేన, టీడీపీ కేడర్ అంటోంది.

లోక్‌సభకు రాపాక ఎంపికపై స్వపక్ష ఎమ్మెల్యేల్లోనే అసంతృప్తి?

అమలాపురం లోక్‌సభ సమన్వయకర్తగా రాజోలు జనసేన సిటింగ్ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావును నియమిస్తూ వైసీపీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం కోనసీమ జిల్లాలోనిమిగిలిన నియోజకవర్గాల అభ్యర్థుల్లో నిరుత్సాహానికి కారణమైంది. రాపాకకు రాజోలు మినహా మిగిలిన నియోజకవర్గాల్లో పెద్ద పట్టు ఉండదని, తమ నియోజకవర్గాల్లో దళితుల ఓట్లపై పెద్దగా ప్రభావం కనిపించదని ఆ పార్టీకి చెందిన సిటింగ్ ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల్లో మాదిరిగా ఏ అభ్యర్థిని పెట్టినా వైసీపీ గెలుచుకోస్తుందన్న అతి ధీమాతోనే పార్టీ అధిష్ఠానం లోక్‌సభకు రాపాకను పంపించాలని తీసుకున్న నిర్ణయాన్ని వారు జీర్ణించుకోలేపోతున్నారు. సిటింగ్ ఎంపీగా ఉన్న చింతా అనురాధకు అధిష్ఠానం మాట మాత్రంగా కూడా చెప్పకుండానే నిర్ణయం ప్రకటించింది. అంతకు రెండు రోజుల ముందు నుంచే ఎమ్మెల్యే హోదాలో ఉన్న రాపాక తానే అమలాపురం ఎంపీ అభ్యర్థిగా వైసీపీ నుంచి పోటీ చేస్తున్నానని, తనకు సహకరించాలంటూ బహిరంగ సభల్లో సైతం ఓటర్లను అభ్యర్థించిన పరిస్థితిని ఎంపీ మిథున్‌రెడ్డి ఖండించారు. అప్పటి వరకు సిట్టింగ్ ఎంపీగా ఉన్న చింతా అనురాధను మీరే ఎంపీ అభ్యర్థిగా కొనసాగుతారంటూ చెప్పుకొచ్చిన అధిష్ఠానం మాట మాత్రంగా కూడా చెప్పకుండా రాపాకకు లోక్‌సభ స్థానం ఖరారు చేసింది. అయితే ఎటువంటి వివాదాలు లేని అనురాధను పక్కకు పెట్టడానికి గల కారణాలు మాత్రం అంతచిక్కడం లేదు.విద్యావంతురాలు, వివిధ భాషల్లో మాట్లాడే పరిజ్ఞానం ఉన్న ఆమె లోక్‌సభలో కోనసీమకు సంబంధించిన ఎన్నో కీలక సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేశారు. అయితే లోక్‌సభ పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలు ఆమెనుపెద్దగా పట్టించుకోకపోవడంతో పాటు రాజకీయంగా తనకంటూ ఒక వర్గాన్ని ఏర్పాటు చేసుకోలేని ఎంపీ అనురాధను పార్టీ అధి నాయకత్వం కూడా పట్టించుకోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ తరుణంలో అనురాధ సీఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరారు. వాస్తవానికి సోమవారం అపాయింట్‌మెంట్ ఖరారు అయినట్టు ప్రచారం జరిగినప్పటికీ సీఎంకు కడప పర్యటన ఉన్నందున మంగళవారం కలుస్తానరని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఎటువంటి అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేసిన తనను పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పించాలంటూ అనురాధతో పాటు ఆమె వర్గీయులు కోరుతున్నారు. సీఎంతో భేటీ అనంతరం ఆమె రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. అయితే వైసీపీని వీడే పరిస్థితి ఉండకపోవచ్చుననేది రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్న అంశం.

రాపాక వరప్రసాదరావును ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం వల్ల మిగిలిన నియోజకవర్గాలపై పెద్దగా ప్రభావం ఉండదని, అదే రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థిగా పేర్కొంటున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావును లోక్‌సభకు పంపిస్తే పార్టీకి ఎంతోకొంత ఉపయోగం ఉండేదని కొందరు ఎమ్మెల్యేలు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. అయితే అటు గొల్లపల్లి, ఇటు రాపాక అవినీతి బాగోతాలపై కథనాలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



మహిళా ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ ఐవీ రావు

కార్పొరేట్ కంపెనీలు మహిళను అంగడి సరుకులా మార్చేశాయి

స్త్రీల హక్కులను హరిస్తున్న మనుధర్మ శాస్త్రం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్, మార్చి 10: మహిళలపై సమాజంలో వివక్ష నేటికీ కొనసాగుతోందని శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి ఆరోపించారు. మహిళలపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయని, వాటిని నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. మహిళా దినోత్సవాన్ని కొందరు ఈవెంట్లలా భావిస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలు మహిళను అంగడి సరుకులా మార్చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీల హక్కులను హరించే మనుధర్మ శాస్త్రాన్ని ఆర్‌ఎస్‌ఎస్ దేశంలో అమలు చేయాలని చూస్తోందన్నారు. అమలాపురం ఎంప్లాయీస్ హోంలో ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు గరగ సీతాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ఆచారాల పేరుతో మహిళలపై జరుగుతున్న అన్యాయంపై మార్పు రావాలన్నారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు అడ్డుకట్ట పడేలా మహిళలు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుకు దూసుకుపోతున్నా వివక్షత మాత్రం వీడలేదన్నారు. మహిళా చైతన్యం కోసం సంఘటిత పోరాటాలు అవసరమన్నారు. మహిళా శక్తి గొప్పదనాన్ని యూటీఎఫ్ ప్రతినిధులు పీఎస్ శిరోమణి, బి.చంద్రకళ, ఐద్వా జిల్లా కార్యదర్శి టి.నాగవరలక్ష్మి వివరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, కోశాధికారి సీహెచ్ కేశవరావు, జిల్లా కార్యదర్శులు జీవీ రమణ, పి.మురుగేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, కుడుపూడి శ్రీనివాసరావు, టి.దుర్గాప్రసాద్, వి.రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీవీఎన్ చైతన్య, రాష్ట్ర కౌన్సిలర్ మేరీ రూత్, వందలాది మంది మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ ధనలక్ష్మి



వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

'మహిళా ఉపాధ్యాయ హక్కులకు భంగం కలిగితే పోరాటం'

ముమ్మిడివరం, మార్చి 10: స్త్రీ లేనిదే సృష్టి లేదని, స్త్రీలు అన్ని రంగాల్లోనే ముందంజ వేస్తున్నారని, విద్యాపరంగా మహిళలు ముందు వరుసలో ఉన్నారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు పేర్కొన్నారు. ఆదివారం ముమ్మిడివరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షురాలు పి.హిమబిందు అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళా ఉపాధ్యాయులు హక్కులకు భంగం కలిగితే వెన్నంటే ఉండి పోరాటం సాగిస్తామన్నారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో మహిళా ఉద్యోగులు హాజరయ్యారు. ఆట పాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. చిన్నారులు మహిళల గొప్పదనాన్ని తెలియచేసే విధంగా పలు ప్రదర్శనలు ఇచ్చారు. ఆట, పాటల్లో విజేతలైన మహిళలకు బహుమతులు అందించారు. జిల్లావ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన సుమారు 25 మంది ఉత్తమ మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సత్కరించి మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యపల్లంరాజు, ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ, మహిళా కన్వీనర్ వి.రత్నకుమారి, మహిళా ఉపాధ్యక్షురాలు ఎంయూఎం గంగాభవానీ, మండల ప్రధాన కార్యదర్శి కె.వెంకటలక్ష్మి, పి.వెంకటేశ్వరరావు, వేమగిరి వీర వెంకట సత్యనారాయణ, ఎం.లక్ష్మణకుమార్, వీవీవీ సత్యనారాయణరాజు, నల్లా రామకృష్ణ, కోట బాలకృష్ణ, కుడుపూడి హేమంత్, వి.సతీష్, వంగా అయ్యప్పకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు

'సిద్ధం' సభకు బస్సులు: ప్రయాణికుల పాట్లు



అమలాపురం రూరల్, మార్చి 10: సీఎం జగన్ సిద్ధం సభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సులను తరలించడంతో ఆదివారం ప్రయాణికులు పడ్డ అవస్థలు వర్ణనాతీతం. జిల్లాలోని ఆర్టీసీ డిపోల నుంచి మొత్తం 80 బస్సులను సిద్ధం సభకు తరలించారు. ఒక్క అమలాపురం డిపో నుంచే 30 బస్సులు వెళ్లడంతో ప్రయాణికులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు పడ్డా గమ్యస్థానాలకు చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది. దాంతో ప్రయాణికులు అత్యధిక ధరలు చెల్లించి ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎన్నికల శిక్షణకు గైర్హాజరు

19 మంది టీచర్లకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు

కొత్తపేట, మార్చి 10: కొత్తపేట నియోజకవర్గానికి సంబంధించి పోలింగ్ ఆఫీసర్ డ్యూటీ పడిన ఉపాధ్యాయులకు ఈవీఎంల పనితీరుపై ఈ నెల 7వ తేదీన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. దీనికి గైర్హాజరైన 19 మంది ఉపాధ్యాయులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారందరూ సోమవారం కలెక్టర్‌ను కలిసి సమాధానం ఇవ్వనున్నట్టు సమాచారం.

బీసీలకు టీడీపీ పుట్టినిల్లు

- వైసీపీ అరాచక పాలన అంతానికి కూటమి సంసిద్ధం: టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి



కొత్తపేట, మార్చి 10: బీసీ వర్గాలకు తెలుగుదేశం పార్టీ పుట్టినిల్లు అని.. వైసీపీ అరాచక పాలన అంతానికి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సంసిద్ధంగా ఉందని టీడీపీ కోనసీమ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి పేర్కొన్నారు. ఆదివారం ఆమె కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల ఆధారంగా అధినేత చంద్రబాబునాయుడు పొత్తు నిర్ణయం తీసుకున్నారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఏపీ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబెడిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. వైసీపీ పాలనలో ప్రభుత్వం అంటే కేవలం జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డిగా మారిందన్నారు. వైపీపీ ప్రభుత్వంలో బీసీలను ఎంత హీనంగా చూశారో వైసీపీకి చెందిన బీసీ సెల్ అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి మాటల్లోనే స్పష్టమైందన్నారు. టీడీపీపై కేంద్రంలో బీజేపీ పెద్దలకు కూడా నమ్మకం పెరిగినందునే పొత్తులకు ఆహ్వానించిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ఎన్నికల బరిలో విజయదుందుభి మోగించడం ఖాయమన్నారు.

14న వైసీపీలోకి ముద్రగడ పద్మనాభం ...7లో



రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడికి వేడుకగా రథోత్సవం

అన్నవరం, మార్చి 10: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ప్రతి ఆదివారం ఆర్జితసేవగా తీసుకొచ్చిన రథోత్సవం భక్తుల గోవిందనామ స్మరణల నడుమ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు ఆలయ పీఆర్వో కృష్ణారావు టెంకాయి కొట్టి రథోత్సవం ప్రారంభించారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ వేడుకగా ముమ్మారు స్వామి,అమ్మవార్లు రథంపై ఆశీనులై తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితుల గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి పారాయణలు, జపములు, నిర్వహించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేత



అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఇద్దరు దాతల నుంచి రూ.2లక్షలు విరాళాలుగా సమకూరాయి. అంగనంపూడికి చెందిన ఉప్పలపాటి నరేంద్రనాథ్ రూ.1,11,116, తునికి చెందిన పులవర్తి వెంకట జగన్నాథ గుప్తా రూ.1,00,100ను దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈసందర్భంగా దాతను అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ట్రస్టీ దోమాడ సుందరరావు తదితరులున్నారు.

వైభవంగా కుక్కుటేశునికి త్రిశూలస్నానం



కుక్కుటేశ్వరస్వామికి త్రిశూలస్నానం చేయిస్తున్న అర్చకులు

పిఠాపురం, మార్చి 10: కాకినాడజిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లకు త్రిశూల స్నానం నిర్వహించారు. కైతేపల్లి కుటుంబసభ్యులు ఉత్సవమూర్తులకు పూజలు జరిపి త్రిశూలస్నానం జరిపించారు. పూజలు నిర్వహించిన ఆలయ అర్చకులు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అంతకుముందు స్వామికి అభిషేకం, అమ్మవా రికి కుంకుమార్చన జరిగాయి.రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న కల్యాణోత్సవాలు

పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వెలసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు సోమవారం రాత్రితో ముగియనున్నాయి. చివరిరోజు తెప్పోత్సవం, శ్రీపుష్పయాగం నిర్వహించనున్నారు. ఉదయం 6గంటలు నుంచి స్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, రాత్రి 7గంటలు నుంచి పాదగయ పుష్కరిణిలో హంసవాహనంపై స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహిస్తారు. అనంతరం శ్రీపుష్పోత్సవం, ఏకాంతా సేవాగానం, స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం చేస్తారు. అనంతరం భక్తులకు దంపత తాంబూలాలు అందజేశారు. తెప్పోత్సవం, శ్రీపుష్పయాగానికి భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున అందు కు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో నారాయణమూర్తి తెలిపారు.

ఘనంగా త్రిశూల స్నాన పూజలు



దేవతామూర్తులను పల్లకీలో తీసుకెళుతున్న ఈవో, పండితులు

సామర్లకోట, మార్చి 10: కాకినాడజిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవ పూజలు పురస్క రించుకుని ఐదోరోజు ఆదివారం ఉదయం స్వామి,అమ్మవారికి త్రిశూలస్నాన పూజలు, తీర్థపు సేవ పూజలు ఘనంగా నిర్వహి ంచారు. ఆలయ కార్యనిర్వహనాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ ఈవో నీలకంఠం స్వయంగా పల్లకీని మోస్తూ కోనేరు పుష్కరిణి వద్దకు తోడ్కొని వచ్చారు. పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్నబాబు, భీమేశ్వరశర్మ తదితరులచే వేదమంత్రోచ్ఛారణల మధ్య త్రిశూల స్నాన పూజలు నిర్వహించారు. సోమవారంరాత్రి స్వామివారికి, అమ్మవారికి శ్రీ పుష్పయాగోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో నీలకంఠం తెలిపారు.

ఘనంగా రథోత్సవం

మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా స్వామివారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులతో శనివారం సాయంత్రం ప్రారంభించిన రథోత్సవం ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు దేవీచౌక్ వద్ద రథం షెడ్ సెంటర్‌కు చేరుకుంది. వివిధ సంస్కృతిక ప్రదర్శనలు, బాణసంచా కాల్పుల మధ్య రథోత్సవ ఉత్సవమూర్తులను తిరిగి పల్లకీలో ప్రతి ష్ఠించి ఆలయానికి తోడ్కొనే సమయంలో బాణాసంచా కాల్చారు.

సాహిత్యం అనంతమైనది..

- సినీ గేయ రచయిత భువన చంద్ర
- ముగిసిన అఖిలభారత తెలుగు సాహితీ సదస్సు

పోర్టుసిటీ (కాకినాడ), మార్చి 10 : సాహిత్యం అనంతమైదని ప్రముఖ సినీ గేయ రచయిత భువన చంద్ర అన్నారు. అఖిల భారత తెలుగుసాహితీ సదస్సు రెండోరోజు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వంగూరి ఫౌండేషన్, తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ సదస్సుకు పెద్దఎత్తున తెలుగు భాషాభిమానులు హాజరయ్యారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఫౌండేషన్ అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు ఈ సందర్భంగా భువనచంద్రకు జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం భువన చంద్ర మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులు మాతృభాష పట్ల అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఎన్ని తరాలైనా తరగని ఆస్తి భాష ఒకటేనని అన్నారు. అనంత రం హాస్యరచనపై మాట్లాడారు. ఈ సందర్భంగా కౌముదీ, గలీవర్ సాహసయాత్రలు పుస్తకావిష్కరణలు జరిగాయి. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ తెలుగుపాట ప్రభావం-ప్రాభవం అంశంపై ప్రసంగించారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జీవి పూర్ణచంద్ మన తెలుగు మరుగులు అంశంపై ప్రసంగించారు. లోలమాలం, అంక పుంకాలు, ఈతబంటి, కమకలి, ఉలుపాలు తదితర అచ్చు తెలుగు పదాల అర్థాలను సోదాహరణంగా సమగ్రంగా వివరించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన యనమండ్ర శ్రీరామకృష్ణ-లలిత దంపతులను సత్కరించారు. కవి రాజ హంస లు అంశంపై డాక్టర్ ఓలేటి పార్వతీశం, తెలుగు పద్యం చమత్కారం గురించి ప్రసంగించారు. గజేంద్ర



కౌముదీ పుస్తకావిష్కరణ, పాల్గొన్న సాహితీ వేత్తలు

మోక్షం, వ్యక్తిత్వ వికాసం అంశంపై డాక్టర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ, నిలువెత్తు నిత్యజీవన ప్రతిబింబం పుస్తక పరిచయ కార్యక్రమంలో యల మర్తి అనురాధ మాట్లాడారు. మధురానగర్ ప్రజా విద్యాలయం విద్యార్థులు ఇంగ్లీషు-తెలుగు అక్షరాల అనువాద కార్యక్రమంలో పాల్గొన్నారు. 25 మంది కవులు, కవయిత్రలతో కవి సమ్మేళనం జరిగింది. కాలగమనంతో కథావస్తువు అంశంపై జయంతి



భువన చంద్రకు జీవన సాఫల్య పురస్కారం అందజేస్తున్న దృశ్యం

ప్రకాష్‌శర్మ, ప్రముఖ కవి విశ్వనాథ సత్యనారాయణ రచించిన మ్రెయి తుమ్మెద పుస్తకం గురించి, సుబ్బని లక్ష్మీనారాయణ మాట్లాడారు. అదేవిధంగా నిజజీవితం నుంచి హాస్య రచనలపై డాక్టర్ కొచ్చర్లకోట జగదీష్, వేమన పద్యాలు-చందస్సు అలంకా రాలపై బేతవోలు రామబ్రహ్మం ప్రసంగించారు. అనంతరం కవిత్వంలో విజేతలైన ఆర్‌వీవీ రాజా, పొత్తూరి సీతారామరాజు, పి.నాగజ్యోతికి, రచనలో విజేతలైన గేదెల సింహాచలం, ఎంఆర్‌వీ సత్యనారాయణ, యలమర్తి అనురాధలకు వరుసగా ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్ర మంలో దంటు కళాక్షేత్రం అధ్యక్షుడు దంటు భాస్కరరావు, సదస్సు నిర్వహణ కమిటీ సభ్యులు మార్ని జానకిరామ్‌చౌదరి, కె.గౌరీనాయుడు, మంగిపూడి రాధిక, జ్యోస్యుల కృష్ణబాబు, బాలాంత్రపు సుచిత్ర, డాక్టర్ కాళ్లకూరి శైలజ పాల్గొన్నారు.

14న వైసీపీలోకి ముద్రగడ

- సీఎం జగన్ సమక్షంలో విజయవాడలో చేరికకు తేదీ ఖరారు
- సీటు ఆశించలేదు.. కేవలం వైసీపీకి ప్రచారం
- వైసీపీ అధికారంలోకి వచ్చాక ఏ పదవి ఇచ్చినా సరే..!



మాట్లాడుతున్న ముద్రగడ

కిర్లంపూడి, మార్చి 10: కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, ఆయన కుమారుడు గిరిబాబు వైసీపీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం కాకినాడజిల్లా కిర్లంపూడిలో తన నివాసంలో ముద్రగడ విలేకరుల సమావేశం నిర్వహించారు. ముద్రగడ మాట్లాడుతూ ఈనెల 14వతేదీన విజయవాడలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరేందుకు వెళ్తున్నానన్నారు. వైసీపీ నాయకులు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కన్నబాబు, ఎంపీ వంగా గీత ఇతర నాయకులు ద్వారా వచ్చిన పిలుపుమేరకు వారికి మద్దతుగా పార్టీలో చేరడంపై నిర్ణయం తీసుకున్నానన్నారు. మరిన్ని పథకాలు పేదలకు చేరేలా కృషిచేయడానికి పార్టీలో చేరుతున్నానన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ సీటు అడగకుండా, ఏదీ ఆశించకుండా పార్టీకి సర్వీసు చేయడం కోసమే పార్టీలో చేరుతున్నట్లు వివరించారు. భగవంతుడి దయ వల్ల వైసీపీ మళ్లీ అధికారంలోకి రావాలని వచ్చాక అధినాయకులు ఏ పదవి ఇచ్చినా తీసుకోవడానికి సుముఖంగా ఉన్నానన్నారు. అంతేకానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో తనకు కానీ, తన కుమారుడికి కానీ సీటు అడిగే ఉద్దేశం పెట్టుకోలేదన్నారు. ప్రత్యక్ష రాజకీయంలో ఉన్నాననుకుని ముఖ్యమంత్రి జగన్ తరుపున ప్రచారం చేస్తానని ముద్రగడ తెలిపారు. వైసీపీ అధికారంలోకి రావడానికి పార్టీకి సేవ చేస్తానని తన వంతు శాయశక్తులా కృషిచేస్తానని అధినాయకులకు చెప్పానన్నారు.

మంత్రి సభకు జనాలు అరకొరే

- కుర్చీలను మడత పెట్టేసిన పంచాయతీ సిబ్బంది
- హుకుంపేటలో 'చేయూత' పంపిణీ సభ

రాజమహేంద్రవరంరూరల్, మార్చి10: ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లిందో లేక తీవ్ర వ్యతిరేకతో తెలియదుగాని మంచినీళ్ల, స్నాక్స్, బస్సులు వంటివి ఏర్పాటు చేసినా కార్యక్రమాలకు ప్రజలు హాజరుకావడం లేదు. మొదటి మీటింగ్‌కు ఫుల్‌గా వచ్చారు, రెండోసారి మీటింగ్‌కు తగ్గారు.. ఆదివారం రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట పరిధిలోని నేషనల్ హైవే ఆనుకొని డీమార్టు పక్కనున్న ఖాళీ స్థలంలో ప్రభుత్వ పథకాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటుచేశారు. మంత్రి వేణుగోపాలకృష్ణ నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్‌గా వచ్చినప్పటి నుంచి పింఛన్ల పంపిణీ, డ్వాక్రా మహిళల సున్నావడ్డీ, ఆదివారం చేయూత పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. చేయూత పంపిణీ కార్యక్రమానికి ఆరు వేలు జనసమీకరణ చేయాలని, వాటికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలంటూ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. అయితే వారు అనుకున్న దానికంటే సగం మంది కూడా హాజరు కాకపోవడంతో మంత్రి అవాక్కయ్యారు. దీంతో ఖాళీగా వున్న కుర్చీలను మడత పెట్టాలంటూ చెప్పడంతో పంచాయతీ కార్మికులతో కుర్చీలను ఎత్తివేయించారు. మరొక విషయం ఏమిటంటే ప్రతి సమావేశానికి బస్సులు పంపించే పాఠశాలల యాజమాన్యం కూడా బస్సులను పంపించలేమం



కుర్చీలను ఎత్తివేస్తున్న పంచాయతీ సిబ్బంది

టూ చేతులెత్తేస్తోందని కొంతమంది అధికారులు చెవులు కొరుక్కొంటున్నారు. ఈనెల 7న ముఖ్యమంత్రి చేయూత బటన్ నొక్కారు. ఆదివారం (మార్చి 10) రూరల్ మండలం పరిధిలో చేయూత చెక్కును పంపిణీ చేయడం ఏమిటంటూ కార్యక్రమాల నిర్వహణ పేరుతో పార్టీ ప్రచారాలు చేసుకుంటూ పంచాయతీ, మండల పరిషత్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారంటూ పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేపు వందే భారత్ రెండో ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం

- సికింద్రాబాద్ నుంచి విశాఖల మధ్య రాకపోకలు

సామర్లకోట, మార్చి 10: విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు రెండవ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 12న మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈ రైలును ట్రయల్‌గా మంగళవారం సికింద్రాబాద్ నుంచి విశాఖకు ఒకవైపునకు మాత్రమే ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఈమేరకు సామర్లకోట రైల్వేస్టేషన్‌కు ఆదివారంరాత్రి దక్షిణ మధ్య రైల్వే సీపీటీఎం అధికారి ఎం.ఏల్వేందర్‌యాదవ్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు ఆంధ్రజ్యోతి సేకరించిన సమాచారం ఇలాఉంది. ఇప్పటికే విశాఖ-సికింద్రాబాద్‌ల మధ్య ఒక వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు రాకపోకలు సాగిస్తున్న విషయం విదితమే. ఈ రెండు పట్టణాల మధ్య ప్రయాణికుల అవసరాలను రైల్వే గుర్తించి రెండవ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా పలు రైల్వేస్టేషన్లలోని అభివృద్ధి పనులకు, నూతన రైళ్లకు ఈనెల 12న శ్రీకారం చుట్టనున్నందున మంగళవారం సికింద్రాబాద్-విశాఖల మధ్య ట్రయల్ రన్‌గా రెండవ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు రానున్నది. అధికారికంగా రెగ్యులర్‌గా ఈనెల 13న విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు రైలు నెం.20708 గానూ, ఈనెల 15న సికింద్రాబాద్ నుంచి విశాఖకు రైలు నెం.20707 గానూ 8 కోచ్‌లతో ఈ రెండు నగరాల మధ్య రాకపోకలు సాగించనున్నాయి. ఈ రైళ్లు వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమహేంద్రవరం, సామర్లకోటలలో ఆగనున్నాయి. గురువారం మినహా వారంలో మిగిలిన ఆరు రోజులలోనూ రాకపోకలు సాగించనున్నాయి. 20707 నంబరుగల వందే భారత్ రెండవ ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్‌లో తెల్లవారుజామున 5.05 గంటలకు బయలుదేరి 6.39కి వరంగల్ చేరుతుంది. ఖమ్మం 7.43కి చేరి కొండపల్లి రూట్ మీదుగా విజయవాడకు 9.10కి చేరుతుంది. రాజమహేంద్రవరంనకు 11.02కి చేరుతుంది. 11.43కి సామర్లకోటకి చేరి దువ్వాడ మీదుగా విశాఖకు మధ్యాహ్నం 1.50కి చేరుతుంది. 20708 నంబరు



వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

గల వందేభారత్ రెండవ ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖలో మధ్యాహ్నం 2.35కి బయలుదేరి దువ్వాడ మీదుగా సామర్లకోటకు సాయంత్రం 4.03 నిమిషాలకు చేరుతుంది. రాజమహేంద్రవరంనకు 4.38కి చేరి తిరిగి విజయవాడకు రాత్రి 6.40కి చేరుతుంది. కొండపల్లి మీదుగా ఖమ్మంనకు రాత్రి 10.03కి చేరుతుంది. వరంగల్‌కు రాత్రి 11.03కి చేరుతుంది. సికింద్రాబాద్‌కు రాత్రి 11.20కి చేరుతుంది. ఈనెల 12న లాంఛనంగా ట్రయల్ రన్ ప్రారంభించనున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు చరాకపురష్కరించుకుని సామర్లకోట, రాజమహేంద్రవరం స్టేషన్లలో ప్రయా ణికులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఈ రెండు స్టేషన్ల రైల్వే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వన్‌స్టేషన్ వన్ సేల్ పేరిట స్టేషన్ ఆవరణలలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను కూడా మంగళవారం ప్రారంభించేలా ఆదేశాలను జారీ చేశారు.

తోటలో కాలేజీ పుస్తకావిష్కరణ



మాట్లాడుతున్న డాక్టర్ పీవీ రమేష్

కాకినాడ రూరల్, మార్చి 10: కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ కళాశాలలోని పరిపాలనా విభాగంలోగల ఎల్‌సీడీ హాల్లో ఆదివారం సాయత్రం తోటలో కాలేజీ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఏపీ ప్రభుత్వ విశ్రాంత అదనపు చీఫ్ సెక్రటరీ పీవీ రమేష్ పాల్గొని 358 పేజీల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ముళ్లపూడి శ్రీనివాస ప్రసాద్ సంకలనంచేయగా డాక్టర్ ఎంవీ భరతలక్ష్మి, ఫైడా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా పీవీ రమేష్ మాట్లాడుతూ ఈపుస్తకంలో పిఠాపురం రాజా, రఘుపతి వెంకయ్యనాయుడు కలిసి ఆరోజుల్లో పీఆర్ కళాశాలను, ఏవిదంగా అభివృద్ధి చేశారో రచయిత తెలపడం జరిగిందన్నారు. పలువురు అధ్యాపకులు, ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాపికొండలకు వెళ్లిన ఆరు బోట్లు



పాపికొండలకు వెళుతున్న పర్యాటక బోట్లు

దేవీపట్నం, మార్చి 10: ఆదివారం పాపికొండలకు ఆరుబోట్లలో సుమారు 450 మంది పర్యాటకులు వెళ్లారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలు పూడిపల్లి, దేవీపట్నం, మంటూరు, కొండమొదలు గ్రామాలు మీదుగా పాపికొండలు చూసి వెనుదిరిగారు. పాపికొండలు అందాలు చూసి పర్యాటకులు మంత్రముగ్ధులయ్యారు.

ముగిసిన భావనారాయణస్వామి తిరునాళ్లు

- వైభవంగా సాగిన మాఘమాసోత్సవాలు



సర్పవరం జంక్షన్, మార్చి 10: కాకినాడ జిల్లాలోనే సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణ స్వామి ఆలయంలో ఫిబ్రవరి 10 నుంచి మార్చి 10 వరకు నెలరోజులపాటు నిర్వహిస్తున్న మాఘమాస తిరునాళ్లు ఆదివారంతో ముగిశాయి. మాఘమాసోత్సవాల్లో భాగంగా అయిదో ఆదివారం శ్రీ భావనారాయణస్వామిని దర్శించుకునేందుకు ఉమ్మడిజిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ముందుగా భక్తులు భావనారాయణస్వామిని దర్శించుకున్న అనంతరం ఈశాన్యంలో గల లక్ష్మీదేవి, ఆగ్నేయంలో గల ఆదిశేషు శ్రీభావనారాయణ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన పాలపొంగులను ఆవుపిడకలతో పొయ్యిపై తయారుచేసి భక్తిశ్రద్ధలతో స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. మాఘమాసంలో శ్రీభావనారాయణస్వామిని దర్శించుకుంటే దేశంలో ఉన్న 108 వైష్ణవ దేవాలయాలను దర్శించుకున్న ఫలితం దక్కుందని భక్తులు తెలిపారు. ఆలయ కమిటీ, దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుల్ల సుధాచందూ, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హాకీ చాంపియన్ షిప్‌లో ఉమ్మడి జిల్లా జట్టు ప్రతిభ

కాకినాడ అర్బన్, మార్చి 10: ప్రకాశం జిల్లా మైనంపాడులో జరిగిన రాష్ట్ర మహిళా హాకీ చాంపియన్‌షిప్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు కైవసం చేసుకుంది. ఫైనల్‌లో అనకాపల్లి జట్టుపై 2.0 స్కోరుతో గెలుపొందింది. జట్టు శిక్షకుడిగా వి.రవిరాజు, మేనేజర్‌గా జి.దుర్గాదేవి, కెప్టెన్‌గా డా.నందిని వ్యవహరించారని హాకీ సంఘం జిల్లా కార్యదర్శి నంబూరి శ్రీనివాసరావు తెలిపారు.



రాష్ట్ర హాకీ మహిళా చాంపియన్‌షిప్ సాధించిన జిల్లా జట్టు

తలపై తారాజువ్వ పడి బాలిక మృతి

వీరంపాలెం శివరాత్రి ఉత్సవాల్లో అపశ్రుతి



మృతి చెందిన పుష్ప

తాడేపల్లిగూడెంరూరల్, మార్చి 10 : పశ్చిమగోదావరిజిల్లా తాడేపల్లిగూ డెం మండలం వీరంపాలెం మహా శివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం రాత్రి బాణసంచా కాలుస్తుండ గా తారాజువ్వ బాలిక తలపై పడి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దేవరపల్లి మండలం త్యాజంపూడికి చెందిన దాసరి పుష్ప (12) తన స్నేహితురాలితో కలిసి శివరాత్రి ఉత్సవాల ఊరేగింపు తిలకించేందుకు వచ్చింది. ఊరేగింపులో భాగంగా బాణసంచా కాలుస్తుండగా జువ్వ విఫలమై బాలిక తలపై పడింది. దీంతో పుష్ప తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. అపస్మారక స్థితికిచేరి మృతిచెందింది. బాలిక మృతదేహాన్ని తాడేప ల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించినట్టు సీఐ రమేష్ తెలిపారు.

త్యాజంపూడిలో విషాదఛాయలు



దాసరి పుష్ప (ఫైల్)

దేవరపల్లి, మార్చి 10: దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామానికి చెందిన దాసరి చిట్టి, లక్ష్మీ దంపతుల కుమార్తె పుష్ప(16) యర్న గూడెం జడ్పీహైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. శివరాత్రి సందర్భంగా సెలవులు రావడంతో తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడ బాలత్రిపుర సుందరిపీఠం శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా 2వరోజు శనివారంరాత్రి బాణసంచా కాలుస్తుండగా పుష్ప తలపై టపాస్ పేలడంతో బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. త్యాజంపూడిలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. దాసరి చిట్టి, లక్ష్మీలకు ముగ్గురు పిల్లలు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. ఒక కుమారుడు వ్యవసాయ కూలీ పనిచేస్తుండగా రెండో కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. కుమార్తె పుష్ప యర్నగూడెం హాస్టల్‌లో ఉంటూ 9వ తర గతి చదువుతోంది. స్వగ్రామమైన త్యాజంపూడిలో సెలవులకు వెళ్లి బాబాయ్ కుమార్తెతో కలిసి వీరంపాలెం ఉత్సవాలు చూడడానికి వెళ్లింది. ఈ ప్రమాదంతో త్యాజంపూడిలో విషాదఛాయలు అలుముకున్నాయి. హైస్కూల్ హెచ్ ఎం.ఊబా చంద్రరావు, సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి సంతాపం వ్యక్తంచేశారు.

మన్యం బంద్ ప్రశాంతం

చింతూరు, మార్చి 10 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుని నిరసిస్తూ గిరిజన సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం బంద్ ప్రశాంతంగా, సంపూర్ణంగా జరిగింది. వ్యాపార సముదాయాలు, పెట్రో బంక్‌లు, హోటల్లు మూసివేసి గిరిజనుల డిమాండ్లకు మద్దతు ఇచ్చారు. బంద్‌లో భాగంగా గిరిజన సంఘాల నా యకులతో పాటు పలువురు గిరిజనులు, వివిధ పార్టీలకు చెందిన గిరిజన నాయకులు, గిరిజన ఉద్యోగ సంఘ నాయకులు ర్యాలీ, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్, సీపీఎం జిల్లా నాయకుడు సీసం సురేష్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ అంటూ దగా డీఎస్సీని ప్రకటించి గిరిజనులపట్ల తన చిత్తశుద్ధిని ప్రక టించుకుందని ఆరోపించారు. జీవో నెం.3అమలుకు వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చట్టబద్ధత తీసుకురాకుండా మిన్నకుండి పోయిందని, దీంతో చదువుకున్న ఆదివాసీ యువత తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలు సంపూర్ణ అభివృద్ధిని సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విడ్డూరమన్నారు. ఆదివాసీ ప్రాంతంలో నూటికి నూరుశాతం ఉద్యోగ అవకాశాలు గిరిజనులకే కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అప్పటివరకు గిరిజనులు ఐక్య ఉద్యమాలకు నడుం బిగించాల్సి ఉందన్నారు. ఉద్యమాలతోనే హక్కులు సాధించుకునే అవకాశం ఉందన్నారు. గిరిజన నాయకులు దిలీప్, శీలం తమ్మయ్య, పాండ్రు నాగార్జున, మొట్టుం రాజయ్య, కారం సుబ్బారావు, తీగలరవి, భీమయ్య పాల్గొన్నారు.

రంపచోడవరంలో బంద్

రంపచోడవరం మార్చి 10: రంపచోడవరంలో మన్యం బంద్ ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఆదివారం ఉదయం సీపీఎం, సీఐటీయూ గిరిజన సంఘం నాయకులు ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. జీవో నెం.3, స్పెషల్ డీఎస్సీ, పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని తదితర డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ జిల్లాలో ఆదివారం బంద్ నిర్వహించగా రంపచోడవరంలో చేసిన బంద్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మట్ల వాణిశ్రీ , సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు (గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు) లోతా రామారావు తదితర నాయకులు ఉన్నారు.



చింతూరులో బంద్ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు



కూనవరంలో రోడ్లపై వాహనాలు ఆపి నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

ఉచిత కంటి పరీక్షా శిబిరం

అమలాపురం టౌన్, మార్చి 10: నల్లవంతెన దిగువున ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ అమలాపురం చార్టర్ ప్రెసిడెంట్ మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి సౌజన్యంతో 260 మందికి కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపాలు ఉన్నవారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. జేసీఐ పట్టణ శాఖ అధ్యక్షుడు ఆకొండి చాణక్య, సీహెచ్ సుస్మిత, బి.నిహారిక పాల్గొన్నారు.

మహిళా విద్యకు పునాదులు వేసిన సావిత్రిబాయి పూలే

ద్రాక్షారామ, మార్చి 10: దేశంలో మహిళా విద్యకు పునాది వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం ద్రాక్షారామ, రామచంద్రపురంలో నిర్వహించారు. ద్రాక్షారామలో నియోజక వర్గ మైనార్టీ బీసీ సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు జ్యోతీరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు మాగాపు అమ్మిరాజు, కానీల వీరభద్రరావు, వేమవరపు రాంబాబు, షావుకారు శివయ్య, సూదంశెట్టి గంగాధర్ పాల్గొన్నారు. జనసేన నాయకుడు చిక్కాల దొరబాబు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేగల సతీష్, బుంగరాజు, నల్లా వెంకటేష్ పాల్గొన్నారు. పట్టణంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని చిక్కాల దొరబాబు తన కార్యాలయంలో నిర్వహించారు.

సావిత్రిబాయి పూలే వర్ధంతి

అమలాపురం రూరల్, మార్చి 10: బండారులంకలోని కాంగ్రెస్ జిల్లా శాఖ కార్యాలయం వద్ద ఆదివారం ఎస్సీ డిపార్టుమెంటు జిల్లా చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన సావిత్రీబాయిపూలే వర్ధంతిని నిర్వహించారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాలు చేయడంతో పాటు తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఎందరికో జ్ఞానాన్ని పంచారని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అయితాబత్తుల సుభాషిణి, మాచవరపు శివన్నారాయణలు పేర్కొన్నారు. సావిత్రీబాయిపూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు వంటెద్దు బాబి, కుడుపూడి శ్రీనివాసరావు, మహబూబ్ షకీల, రాయుడు గంగాభవానీ, రెడ్డి బాబు, రాయుడు వెంకటరమణ, నెల్లి వెంకటరమణ, పి.ప్రకాష్ పాల్గొన్నారు.

నామన రాంబాబుకు పరామర్శ

మామిడికుదురు, మార్చి 10: భార్యా వియోగంతో బాధపడుతున్న నామన రాంబాబును టీడీపీ జోన్-2 పరిశీలకుడు మందలపు రవి, టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి హరీష్ మాధుర్‌లు ఆదివారం పరామర్శించారు. కృష్ణవేణి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వీరితో పాటు మోకా ఆనంద్‌సాగర్, బోనం బాబు, చుట్టుగుళ్ల కిశోర్, శేరు శ్రీనుబాబు, బొలిశెట్టి ప్రభుదాస్, నామన కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి వస్త్రాలకు రూ.35,750 ఆదాయం

అంతర్వేది, మార్చి 10: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో స్వామి-అమ్మవార్లకు వచ్చిన వస్త్రాలకు ఆదివారం వేలం పాట నిర్వహించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. రూ.35,750 ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ చైర్మన్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, సూపరింటెండెంట్ విజయసారథి పాల్గొన్నారు.

పల్లెలు అభివృద్ధితో రాష్ట్రాభివృద్ధి

ఏపీ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ వెంకటరామిరెడ్డి
స్థానిక వైసీపీ కార్యాలయంలో సెల్ఫీలు, ఫొటోలు

పి.గన్నవరం, మార్చి 10: సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్‌క్లీనిక్స్ ఏర్పాటుతో గ్రామాల్లోఅభివృద్ధి జరిగితే రాష్ట్రంలో అభివృద్ధి జరిగినట్లు కాదా అంటూ ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం, ఏపీ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. పి.గన్నవరంలో ఆదివారం నిర్వహించిన ర్యాలీలో ఏపీజీఈఎఫ్ వైస్ చైర్మన్ విప్పర్తి నిఖిల్‌కృష్ణతో కలిసి ఆయన పాల్గొని మీడియాతో మాట్లాడారు. ఉద్యోగులు జై.. వెంకటరామిరెడ్డి...జైజగన్...జైజై జగన్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఉద్యోగులు వెంకటరామిరెడ్డితో ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు ఉత్సాహం ప్రదర్శించారు. వివిధ శాఖల ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలపై వినతిపత్రాలను ఆయనకు అందించారు. ఏపీజీఈఎఫ్ జనరల్ సెక్రటరి అర్వాపాల్, రాష్ట్ర రెవెన్యూ జేఏసీచైర్మన్ దివాకర్, సచియాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్రజనరల్ సెక్రటరీ అంకంరావు, తూర్పుగోదావరి ఉద్యోగుల సంఘాలరీజనల్ కోఆర్డినేటర్ దారపురెడ్డి తాతాజి పాల్గొన్నారు.

ముమ్మిడివరం బీఎస్పీ అభ్యర్థిగా భీమారావు

అమలాపురం టౌన్, మార్చి 10:ముమ్మిడివరంఅసెంబ్లీ నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థిగావాకపల్లి భీమారావును నియమించారు. బీఎస్పీ జిల్లా కార్యాలయంలో ఆదివారం కుసుమ వెంకటేశ్వరరావు అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి ఆదేశాలతో భీమారావును నియమించినట్టు మూడు జిల్లాలఇన్‌చార్జి బత్తుల లక్ష్మణరావు ప్రకటించారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడాలి





ఆత్రేయపురం: బండారు సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలోకి చేరికలు, మండపేట: వేగుళ్ల సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు, కాట్రేనికోన: బుచ్చిబాబు సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన దృశ్యం

- టీడీపీ, జనసేన అభ్యర్థి బండారు సత్యానందరావు
- పలు చోట్ల వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

ఆత్రేయపురం, మార్చి 10: రాష్ట్రాన్ని రావణ కాష్టం చేసి అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని కొత్తపేట అసెంబ్లీ టీడీపీ, జనసేన అభ్యర్థి బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆదివారం బొబ్బర్లంకలో మాజీ సర్పంచ్, టీడీపీ నేత జల్లి కామేశ్వరరావు నాయకత్వంలో 50మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పి స్వాగతించారు. వైసీపీ అవినీతి, అరాచక పాలనకు విసుగుచెంది టీడీపీ గూటికి చేరారన్నరు. పార్టీపైన, తనపైన నమ్మకంతో వస్తున్న వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. టీడీపీ వెలిచేరు గ్రామ శాఖ అధ్యక్షుడు కవల సత్తిబాబు, బుజ్జి నాయకత్వంలో 25మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు ముళ్ళపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మీ వెంకన్న, చల్లపూడి నాగేశ్వరరావు, గణేష్, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అన్ని గ్రామాల్లో సూపర్-6 పథకాలను టీడీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తూ బండారు గెలుపు కోసం ప్రచారం చేస్తున్నారు.

అభివృద్ధిపై నమ్మకంతోనే టీడీపీలో చేరికలు

రావులపాలెం,మార్చి10: టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశ్యంతోనే టీడీపీలో చేరికల జోరు పెరిగిందని బండారు సత్యానందరావు అన్నారు. దేవరపల్లి శివారు పెంకులపాటిగరువుకు చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

టీడీపీ, జనసేన ప్రభుత్వం రావడం ఖాయం

మండపేట, మార్చి10: ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక20వవార్డు గొల్లపుంతలోఆదివారం రెండో రోజు బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఆయన వార్డులో పర్యటించారు. టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం రావటం ఖాయమన్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను ఇప్పటికీ వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు.ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు ఓట్లు వేసి రాష్ట్రాభివృద్ధికి ప్రజలు సహకరించాలని వేగుళ్ల కోరారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నేతలు ఎం.సూర్యప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, శిరంగుఈశ్వ రరావు, బొడ్డు రామకృష్ణ, చింతల శ్రీను, కౌన్సిలర్ యరమాటి గంగరాజు, టీడీపీ, జనసేన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

కపిలేశ్వరపురం మండలం తాతపూడికి చెందిన వైసీపీ కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. వైసీపీ కార్యకర్తలు కడియాల సల్మాన్, జగ్గింశెట్టి నగేష్, బొక్కా సత్యనారాయణ, బూసి గంగాధర్, కుసుమే ప్రభుకుమార్, జగ్గింశెట్టి సాయి, వెంకట్‌లు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జగ్గిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి వేగుళ్ల కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాలదాసి పండు, జె.రాముడు, ఇళ్ల ప్రశాంత్, గుత్తుల శ్రీనివాసరావు, జగ్గింశెట్టి శ్రీనివాస్, సూరంపూడి దనరాజు, బొక్కా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం

రాజోలు, మార్చి 10: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును సీఎంను చేయడమే లక్ష్యంగా పని చేయాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కాట్రేనిపాడులో మాజీ వైస్ ఎంపీపీ అడబాల జగన్నాథరావు స్వగృహం వద్ద గ్రామశాఖ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలంతా కలసికట్టుగా పనిచేయాలని, వైసీపీ దుర్మార్గపు రాక్షస పాలనను తరిమి కొట్టాలన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్-6 పథకాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. కార్యక్రమంలో సూరిశెట్టి శ్రీనివాస్, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, గుండాబత్తుల తాతాజీ, కొల్లు ప్రసాద్, గుండాబత్తుల వెంకటేశ్వరరావు, అంకాని బ్రహ్మానందం, గాలిదేవర వెంకన్నబాబు, మామిడిశెట్టి నాగరాజు, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతి మాతోనే సాధ్యం

కాట్రేనికోన,మార్చి10: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని అసెంబ్లీ అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. ఆదివారం కందికుప్ప ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మిలిటరీపేట నుంచి ప్రచారం ప్రారంభించి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు.అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

కందికుప్ప గ్రామం నుంచి వైసీపీ సీనియర్ నాయకుడు మేకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయన అనుచరులు 50 మంది వైసీపీవీడి టీడీపీ, జనసేన అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీ చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

టీడీపీ పాలనలో రావులపాలేన్ని అభివృద్ధిపరిచాం

రావులపాలెం, మార్చి 10: టీడీపీ పాలనలో రావులపాలేన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని ఆ పార్టీ కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం రావులపాలెంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ తిరిగి సూపర్-6 పథకాల కరపత్రాలను పంపిణీచేసి తనను గెలిపించాలని కోరారు. టీడీపీ హయాంలో అరటి మార్కెట్ యార్డును తీసుకువచ్చి అభివృద్ధి చేశామన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గంజాయి, బార్లు సంస్కృతి తీసుకువచ్చారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన మాసదీక్షా సూర్యారాధన

అమలాపురం రూరల్, మార్చి 10: ఇందుపల్లిలో నెల రోజులుగా జరుగుతున్న నవమవార్షిక మాసదీక్షా సూర్యారాధన ఆదివారం మహా పూర్ణాహుతితో వైభవంగా ముగిసింది. నెల రోజుల పాటు భక్తులు తరలివచ్చి సూర్యారాధనలో పాల్గొన్నారు. యాగకర్త గొర్తి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో శ్రీచక్రార్చన, సువాసినీ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొనగా అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

జ్యోతికి ఉమెన్ ఐకాన్ నేషనల్ అవార్డు ప్రదానం

అల్లవరం, మార్చి 10: కొమరగిరిపట్నానికి చెందిన సోషల్ వర్కర్, స్టేట్ లెవిల్ వలంటీరు కట్టా జ్యోతిని ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెకు ఉమెన్ ఐకాన్ నేషనల్ అవార్డును సాహితీ వేదిక అధ్యక్షుడు చిలుముల బాలరెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ప్రదానం చేశారు

జనసేనకు రాధమ్మ రాజీనామా

కొత్తపేట, మార్చి 10: జనసేనకు రాజీనామా చేస్తున్నట్టు ఆ పార్టీ సీనియర్ నాయకురాలు బండి సత్యరాధ (రాధమ్మ) తెలిపారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు రాజీనామా పత్రాన్ని పంపినట్టు ఆమె చెప్పారు. ఆదివారం ఆమె కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానన్నారు.

ప్రయాణికుల పాట్లు

రావులపాలెం, మార్చి 10: నిత్యం ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తిరిగే బస్సులు సరిపడగా లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభకు రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి 15 బస్సులు తరలివెళ్లాయి. దీంతో వివిధ రూట్లలో తిరిగే బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్సులు లేకపోవడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మానుష్యంగా మారింది. ఎక్కడో జరిగిన సభకు ఇక్కడ బస్సులు తరలించడం ఏమిటని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోషణా పక్వాడ్ కార్యక్రమం

మలికిపురం, మార్చి 10: పోషణా పక్వాడ్ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి అన్నారు. మోరిలో పోషణా పక్వాడ్ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఈనెల9 నుంచి 23వరకు ఈకార్యక్రమంలో భాగంగా రక్త పరీక్షలు, గర్భిణులకు, కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తామన్నారు. అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ కె.చంద్రకళ, ప్రసన్న, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మహిళలు మరింత ఉన్నత స్థితికి ఎదగాలి

అమలాపురం టౌన్, మార్చి 10: మహిళలు మరింత ఉన్నత స్థితికి ఎదగాలని అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి పేర్కొన్నారు. అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం కొల్లాటి దుర్గాబాయి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కల్వకొలను చాయాదేవి ఆధునిక సమాజంలో మహిళలు సాధిస్తున్న విజయాలను వివరిస్తూ స్ఫూర్తిని నింపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళామణులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి సతీమణి అరుణ, దిట్టకవి అమ్మాజీ, పెయ్యల సంధ్య, చిట్టూరి లక్ష్మి, మట్టపర్తి పార్వతి, సంసాని శ్యామలాదేవి, దొంగ నాగసుధారాణి, గొవ్వాల శ్రీదేవి, వాసర్ల లక్ష్మి, పడాల శ్రీదేవి, తిక్కా సత్యలక్ష్మి, మేరీ, షేక్ సుల్తానా, రామలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఇప్పనపాడులో గడపగడపకు..

మండపేట, మార్చి 10: వైసీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నా మని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఇప్పనపాడులో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. పార్టీశ్రేణులు,సచివాలయఉద్యోగులతో కలిసి గ్రామంలో ఇంటింటా పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ ఉండమట్ల వాసు, వైసీపీ గ్రామ అధ్యక్షుడు తిరుశూల శ్రీను, మాజీ ఎంపీపీ నాగిరెడ్డి రాంబాబు, మాజీ జడ్పీటీసీ పోతుల రాంబాబు, ఈవోపీఆర్డీ రాజు, సచివాలయ ఉద్యోగులు, మండల పీఆర్ జేఈ నాగేశ్వరరావు, ఆర్‌డ బ్ల్యుఎస్ ఏఈ బాగ్యరాజ్, యాండ్ర బుజ్జి, చొల్లంగి గోవిందు, ఈదల వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, మార్చి 10: ఆత్మమూరుకు చెందిన కర్రి సుబ్బాయమ్మ కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రూ.50వేలు, గోశాలకు రూ.50 వేలు విరాళం సమర్పించారు. దాతకు ఆలయ చైర్మన్ రమేష్‌రాజు స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా ఆదివారం ఒక్కరోజు ఆదాయం రూ.2,27,215 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

సూపర్-6 పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

మలికిపురం, మార్చి 10: సూపర్-6 పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జనసేన సమన్వయక కర్త గుండుబోగుల పెద్దకాపు అన్నారు. ఆదివారం 5వకస్టర్ ఇన్‌చార్జి రాపాక ఆనంద్‌కుమార్ ఇంటివద్ద అడబాల యుగంధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. చెల్లింగి సత్యనారాయణ,మల్లిపూడిసత్తిబాబు, బందెల పద్మ, గెడ్డం సింహ, చెల్లుబోయిన హెలీన, యెనుముల నాగు, మేడిచర్ల రాము,జనసేన,టీడీపీ కార్యకర్తలుపాల్గొన్నారు.

రామచంద్రపురం జనసేన కాపులకు కేటాయించాలని తీర్మానం



రామచంద్రపురంలో సమావేశమైన కాపు సంఘం నాయకులు

ద్రాక్షారామ, మార్చి 10: రామచంద్రపురం నియోజకవర్గ అసెంబ్లీస్థానం జనసేనకు కేటాయించాలని రామచంద్రపురం నియోజకవర్గ కాపు సంఘం తీర్మానించింది. ఆదివారం రామచంద్రపురం పట్టణంలో కాపు కల్యాణ మండపంలో కాపు సంఘం అధ్యక్షుడు నారపరెడ్డి బలరామ్ అధ్యక్షతన నాయకులు సమావేశమయ్యారు. అనంతరం సమావేశం వివరాలు కాపు నాయకులు వెల్లడించారు. అత్యధిక జనాభా కలిగిన కాపులను గుర్తించి, రామచంద్రపురం నియోజకవర్గం జనసేనకు అవకాశం కల్పించి, కాపులకు టికెట్ కేటాయించాలని టీడీపీ, జనసేన అధినాయకత్వాలను కోరారు. సమావేశంలో కాపుసంఘం గౌరవ అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు, కాపునాడు అధ్యక్షుడు నల్లా సుధాకర్, నున్న చిట్టిబాబు, బ్రాహ్మజీరావు, 3వ వార్డు కౌన్సిలరు అంకం శ్రీనివాస్, అక్కిరెడ్డి శ్రీనివాస్, వై.వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ టిక్కెట్ స్థానికులకే ఇవ్వాలి

టీడీపీ రామచంద్రపురం నియోజకవర్గ టిక్కెట్ పార్టీ కోసం పనిచేసిన వారికే ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెంకే సాంబశివరావు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ కోరారు. నాలుగేళ్లుగా పార్టీ కోసం స్థానికంగా ఉన్న నాయకులు కష్టపడి పనిచేశామన్నారు. పార్టీకి కష్టపడి పనిచేసిన తనకు లేదా మేడిశెట్టి సూర్యనారాయణకు పార్టీ టిక్కెట్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కె.గంగవరం టీడీపీ కంటెస్టెడ్‌జెడ్పీటీసీ పెంకె అన్నపూర్ణ, ఐటీడీపీ నాయకులు పెంకే శివతేజ పాల్గొన్నారు.

రంజాన్ మాసం ప్రారంభం

రావులపాలెం, మార్చి 10: రంజాన్ మాసం ప్రారంభమైందని ముస్లిం పెద్దలు కొత్త కాలనీలోని మసీదు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉపవాసాలు ఉండి ప్రార్థనలు చేస్తారన్నారు. బీబీ సఫియా, ఖదీజతుల్ కుబ్రా, కొమరాజులంక, రావులపాడు, వెదిరేశ్వరం, వాడపల్లి, ర్యాలి, మండపేట, పెనుగొండ గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

మైనింగ్ డైరెక్టర్ వెంకటరెడ్డి పూజలు

అంతర్వేది, మార్చి 10: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని మైనింగ్ డైరెక్టర్ వెంకటరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం అనంతరం వేదపండితులు మహాదాశీర్వచనం అందించారు.

ఫొటోగ్రాఫర్లకు భద్రత కల్పించాలి

అమలాపురం టౌన్, మార్చి 10: ఫొటోగ్రాఫర్లకు భద్రత కల్పించాలని కోరుతూ అమలాపురం ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో నిరసన తెలిపారు. విశాఖ జిల్లా మధురవాడకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయిని ప్రోగ్రాం పేరుతో తీసుకువెళ్లి అతి కిరాతకంగా హత్యచేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. సాయి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ సీఐ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఖ్వాజాబాబు, అధ్యక్షుడు నగేష్, కార్యదర్శి తాతాజీ, కోశాధికారి నాగేంద్ర, ఉపాధ్యక్షుడు పొట్టుపోతు నాగు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శులు రమణప్రసాద్, ఉషాకిరణ్‌రాజు పాల్గొన్నారు.

కె.గంగవరం: విశాఖ జిల్లామధురవాడకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయిని ప్రోగ్రాం పేరుతో తీసుకువెళ్లి అతి కిరాతకంగా హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని ఫొటోగ్రాఫర్ల సంఘం మండల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారంపామర్రు ఎస్ఐ జానీ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ మండలఅధ్యక్షుడు అంబటి సుబ్రహ్మణ్యం, కోనసీమ జిల్లా మెంబర్ కనకరత్నం, కాదా శ్రీనివాసరావు, పోతుల విజయకుమార్, సంతోష్, శ్రీనివాస్, శ్రీరామ్ రమేష్ పాల్గొన్నారు.

సాహితీవేత్తలకు సన్మానం

అమలాపురం టౌన్, మార్చి 10: గౌరవ డాక్టరేట్లు పొందిన ప్రముఖ సాహితీవేత్తలు నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణలను అమలాపురంలోని జిల్లా గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. చిక్కాల రవిశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ అధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని నాలుగు దశాబ్దాలుగా సాహితీ రంగానికి వారు చేస్తున్న కృషిని ప్రశంసించారు. గ్రంథాలయ పాఠకుల సంఘం ప్రతినిధులు గున్నేపల్లి భీమశంకరం, నందుల ప్రసాద్, నామాడి మహేష్‌బాబు, భీమవరపు మురలీకృష్ణ, జల్లి శ్రీనివాస్ నందుల శరణ్య, కాకర మురళీకృష్ణ తదితరులు ఆధ్వర్యంలో దుశ్శాలువాలతో సన్మానించారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

ముమ్మిడివరం, మార్చి 10: విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. సీహెచ్ గున్నేపల్లి శివారు దేవరపల్లిలో రూ.16లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక పాఠశాల భవనానికి ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పెన్మెత్స చిట్టిరాజు, కోలా బాబ్జి, గొలకోటి వీరహనుదుర్గాపద్మజ, దొమ్మేటి అప్పారావు, గొలకోటి ఆంజనేయులు, గొలకోటి నారాయణరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: బాయ్స్
వెంకటరమణ	: ఆపరేషన్ వాలంటైన్
శ్రీలలిత	: గామి
శేఖర్ స్క్రీన్-1	: ఊరిపేరు భైరవకోన
శేఖర్ స్క్రీన్-2	: బుల్లెట్
రమా	: ప్రేమలు
గణపతి	: గుంటూరు కారం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: బీమ
వెంకటపద్మావతి స్క్రీన్-2	: రికార్డు బ్రేక్

వలంటీర్లు... వైసీపీ ప్రచార కార్యకర్తలా?



జగన్‌కు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న వైసీపీ నేతలు, వలంటీర్లు

రాయవరం, మార్చి 10: గ్రామ వలంటీర్లు వైసీపీ ప్రచార కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. చెల్లూరులో ఇంటింటా ప్రభుత్వ సంక్షేమం పథకాల కరపత్రాలను పంపిణీ చేయగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధి వివరాలు తెలుపుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. వలంటీర్లు వైసీపీ కార్యకర్తలా వైసీపీ నేతలతో కలిసి ఇంటింటికీరెండు రోజులుగా తిరుగుతూ ప్రచారం చేస్తున్నట్లు టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు ఆరోపించారు. నడురుబాదలో వలంటీర్లు వైసీపీ నేతలు ఏంచేసి జగన్ రుణం తీర్చుకుంటారని ప్రచారం చేశారు. జగన్‌కు దండం పెట్టుకోవాలని ఒక బాలుడ్ని కోరారు.

జనసేన నాయకుడు దేవ ప్రముఖులతో కలయిక

మలికిపురం, మార్చి 10: జనసేన జనవాణి రాష్ట్ర కన్వీనర్ దేవ వరప్రసాద్ ఆదివారం మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో పలువురు ప్రముఖులను కలిశారు. మోరిలో రాష్ట్ర చేనేత నాయకుడు చింతా వీరభద్రేశ్వరరావును కలిసి మద్దతు కోరారు. ఈసందర్భంగా పలువురు యువకులు చేరి జై జనసేన.. జై తెలుగుదేశం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వప్పుల లక్ష్మీసరస్వతీ రమేష్, మాజీ సొసైటీ అధ్యక్షుడు పిండి వెంకటమోహనరావు, యెనుముల వెంకటపతిరాజా, జక్కంపూడి మాణిక్యాలరావు, ఎ.ధనలక్ష్మీశ్వరరావు, వలవల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తెలుగు నవగర్జన పార్టీ కార్యాలయం ప్రారంభం

ముమ్మిడివరం, మార్చి 10: ముమ్మిడివరంలో నూతనంగా ఏర్పాటుచేసిన తెలుగు నవగర్జన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కాట్రు నాగబాబు ప్రారంభించారు. ముమ్మిడివరం నియోజకవర్గ తెలుగు నవగర్జన పార్టీ అభ్యర్థిగా మల్లాడి కృష్ణారావు పేరును ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అభ్యర్థి మల్లాడి కృష్ణారావు, మహర్షి, శ్రీను, శివ, నాగు, శివాజీ, వీరబాబు, సాగర్, విజయ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

కాట్రేనికోన, మార్చి 10: ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ ఆదివారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తిమ్మాపురంలో విలేజ్‌క్లినిక్, ఆర్బీకే భవనాలు ప్రారంభించారు. లక్ష్మివాడ, పెనుమెల్ల గ్రామాల్లో ఆర్బీకే భవనాలను ప్రారంభించారు. కందికుప్పలో ర్యాపిడ్ శ్యాండ్‌ఫిల్టర్‌ని ప్రారంభించారు. సీతమ్మచెరువు, అడవిపేటల్లో జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో వైసీపీ మండల అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, జడ్పీటీసీ నేల కిశోర్‌కుమార్, నడింపల్లి సూర్యనారాయణరాజు(సూరిబాబు), పాలెపు ధర్మారావు, గంటి వెంకటసుధాకర్, అక్కుల శ్రీధర్, సంసాని నాగేశ్వరరావు, బొమ్మిడి శ్రీను, నాతి సత్యనారాయణ, మోకా చంద్రనాగరత్నం, మండల ఇంజనీరింగు అధికారి సయ్యద్‌షకీర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

స్థానికులకే కేటాయించాలి

మామిడికుదురు, మార్చి10: పి.గన్నవరం అసెంబ్లీ సీటును స్థానిక అభ్యర్థులకే కేటాయించాలని టీడీపీ-జనసేన నాయకుల సమావేశం తీర్మానించింది. ఆదివారం పాశర్లపూడిలో జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ మహాసేన రాజేష్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులకే పి.గన్నవరం సీటు కేటాయించాలని, ఏ పార్టీ అయినా వారి విజయానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామన్నారు. జనసేన మండల శాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, సర్పంచ్‌లు అడబాల తాతకాపు, జాలెం రమణకుమారి, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, సూదా బాబ్జీ, జాలెం సుబ్బారావు, కోళ్ల సురేష్, తులా ఆది,జి.నాగేశ్వరరావు,నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

కన్నుల పండుగగా స్వామివార్ల త్రిశూల స్నానం



కొత్తపేట, మార్చి 10: మందపల్లి శ్రీఉమామందేశ్వరస్వామి, పలివెల శ్రీఉమాకొప్పులింగేశ్వ స్వామివార్ల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం త్రిశూల స్నానం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్నానాలు చేశారు. తొలుత స్వామివార్లను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

27వ వార్డులో సమస్యలు పరిష్కరించాలి

ద్రాక్షారామ, మార్చి 10: రామచంద్రపురం పట్టణం 27వ వార్డు గుళ్లవారిపేటలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిల్లి సూర్యప్రకాష్ ఆదివారం పర్యటించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వార్డులో పలు సమస్యలు పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తానని సూర్యప్రకాష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్‌చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, వైసీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దంగేరులో గడపగడపకు..

కె.గంగవరం, మార్చి10: దంగేరులో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, జడ్పీటీసీ ఓబిళినేని శ్రీవరలక్ష్మిరాజ్‌కుమార్, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు వివరించారు. కోట గ్రామంలో సీసీ రోడ్లను బోస్ ప్రారంభించారు. ఈకార్యక్రమాల్లో డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ పంపు గోవిందరాజు, గ్రామ సర్పంచ్ మల్లిడి సుశీల, సొసైటీ అధ్యక్షుడు సాదా వెంగళరావు, బత్తుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యనే ఆస్తిగా తల్లిదండ్రులు పిల్లలకు అందించాలి

రాయవరం, మార్చి 10: తల్లిదండ్రులు పిల్లలకు విద్యనే ఆస్తిగా అందించాలని ఎంఈవో వై.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. రాయవరం భాష్యం స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎంఈవో, మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్ బాబు మాట్లాడుతూ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తొలుతగా చదువు, ఆటపాటల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అదజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల జోనల్ కోఆర్డినేటర్ సునీత, ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాసగుప్తా, ప్రైమరీ ప్రిన్సిపాల్ మద్దాడ కాంచన, హిందీ ఉపాధ్యాయుడు ద్వారంపూడి చిన్నబాబు, వలంటరీ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెలగల ఫణికృష్ణారెడ్డి, వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి, భాష్యం సిబ్బంది ప్రదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

లంక వాసులకు ఉచిత వైద్య సేవలు

ముమ్మిడివరం, మార్చి 10: మంజీరా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం వలసలతిప్ప, పొట్టితిప్ప, సలాదివారిపాలెం, కొత్తలంక, శేరిలంక గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రి వైద్యురాలు మంజీరా మాట్లాడుతూ పేదలకు తమవంతు సాయంగా ఉచిత వైద్య సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సలాది సీత, కొండేపూడి భద్రరావు, మాజీ సర్పంచ్ గెద్దం శేఖరం, ఎంపీటీసీ కొండేపూడి భవానీ, సలాది రామచంద్రరావు, కొండేపూడి అప్పారావు, బీర చిన్నారావు, కొండేపూడి నాగేశ్వరరావు, గుర్రాల పెదవెంకట్రావు, నేరుడుమిల్లి అబ్బులు పాల్గొన్నారు.

బడుగువానిలంకలో వ్యక్తి అనుమానాస్పద మృతి

ఆలమూరు, మార్చి10: బడుగువానిలంకలో ఆదివారం మార్గాని రమేష్(42) అనుమానాస్పదస్థితిలో మృతిచెందారు. రమేష్ నోరు, ముక్కు నుంచి రక్తం కారడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో రమేష్ దంపతులు ఒకరిపై ఒకరు కుటుంబ కలహాలపై ఫిర్యాదులు చేసుకున్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రమేష్ రావులపాలెం బస్టాండ్‌లోజామకాయల వ్యాపారం నిర్వహిస్తుంటారు. రమేష్ మృతిపై అనుమానాలు ఉన్నట్లు రమేష్ సోదరి మారిశెట్టి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌చార్జ్ ఎస్ఐశ్రీనివాస్ అనుమానస్పద మృతిగాకేసునమోదు చేశారు.

విద్యుదాఘాతానికి ఒకరి మృతి

ఆలమూరు, మార్చి 10: పెనికేరులో ఆదివారం విద్యుదాఘాతానికి ఒకరు మృతి చెందారు. గ్రామానికి చెందిన చవాకుల శ్రీనివాస్(50) ఆదివారం ఉదయం నిర్మాణంలో ఉన్న తన ఇంటికి వాటరింగ్ చేయడానికి మోటార్ ఆన్ చేయగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ మృతదేహానికి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

తెలుగు మహాసభల్లో ఆలమూరు కవి కవితా గానం

ఆలమూరు, మార్చి 10: కాకినాడలో జరుగుతున్న అఖిలభారత తెలుగుమహాసభల్లో ఆలమూరుకు చెందిన యువకవి గొడవర్తి శ్రీనివాస్ ఆదివారం నగరంలో వాన అనే కవితను గానం చేశారు. ఈకవితా గానానికి పలువురు ప్రశంసలుఅందజేశారు. శ్రీనివాస్‌రచించిన ఆలమూరోళ్ల కథలు పుస్తకాలను అఖిల భారత తెలుగుమహాసభల పుస్తక ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలించింది.

ఆదివారపుపేటలో ఎంపీ బోస్ పర్యటన

ద్రాక్షారామ, మార్చి 10: ఆదివారపుపేటలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఆదివారం పర్యటించారు. ప్రముఖ మంత్ర వైద్యుడు కలకొండ రామలింగేశ్వరరావును కలిశారు. తన కుమారుడు సూర్యప్రకాష్‌కు మద్దతునివ్వాలని బోస్ కోరారు. జిల్లా చేనేత సహకార సంఘ నాయకులు పంపన రామకృష్ణ, ఉప్పు రాజు, ఎంపీపీ అంబటి భవానీ, ఏఎంసీ చైర్మన్ పండుగోవిందరాజు, దండంగి చిన్నారావు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి జాతర

మండపేట, మార్చి10: మండపేట వల్లూరి వారి ఇలవేల్పు సత్తెమ్మతల్లి జాతర వేడుకలు ఈనెల6న ప్రారంభమై ఆదివారంతో ముగిసాయి. వల్లూరి వారి కుటుంబసభ్యులు అమ్మవారి ముగింపు ఉత్సవంలో పాల్గొన్నారు. అమ్మవారిని మేళతాళాలు,కోలాటం,బ్యాండ్‌మేళం, డప్పువాయిద్యాలు, గారడి, సాంస్కృతిక కార్యక్రమాలతో వల్లూరి వారి వీధి నుంచి ఊరేగింపుగా కేపీ రోడ్డు మీదుగా పట్టణ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వల్లూరి సాయికుమార్‌బాబు, వల్లూరి వెంకట్రావు, వల్లూరివారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10వేలు విరాళం

మామిడికుదురు, మార్చి 10: బాలబాలాజీ దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి నగరం గ్రామానికి చెందిన వానరాసి వీరశంకరరావు, వెంకటరత్నప్రసాద్‌లు రూ.10వేలు ఆదివారం విరాళంగా అందించారు.